VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com

నిజామాబాద్
బుధవారం
22-6-2023
వెల: రూ.3/-
పేజీలు: 4
సంపుటి:01
సంచిక: 311

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



ఘనంగా
రాజీవ్ వర్ధంతి



2లో

## బోనస్ పథకం..బోగస్

ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు



2లో

## రాష్ట్రవ్యాప్తంగా చల్లబడ్డ వాతావరణం


మోస్తరు వర్షాలు కురిసే అవకాశం



2లో

## చిత్తవుతున్న ధాన్యం రైతులు

దళారులను ఆశ్రయిస్తున్న రైతన్న



- అందెశ్రీ రాసిన గీతంలో స్వల్ప మార్పులు
- సంగీత దర్శకుడు కీరవాణి కంపోజ్
- జూన్2న దశాబ్ది ఉత్సవాల్లో ఆవిష్కరణ
- గీతాన్ని విని ఓకే చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి

# తెలంగాణ రాష్ట్రగీతం సిద్ధం

**హైదరాబాద్,వేగుచుక్క న్యూస్,:** తెలంగాణ రాష్ట్ర గీతంపై ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన గీతాన్ని స్వల్ప మార్పులతో స్వరపరిచారు. తెలంగాణ అవతరణ జరిగి పదేళ్లు కావస్తున్నందున పదేళ్ల సంబరాల్లో భాగంగా జూన్ 2వ తేదీన ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీతో ఈ గీతాన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతానికి కొన్ని మార్పులు చేశారు. ఒకటిన్నర నిమిషం నిడివిలో ఈ గీతం సిద్ధం అవుతోంది. సినీ సంగీత దర్శకుడు కీరవాణితో ఈ పాటను రేవంత్ ప్రభుత్వం కంపోజింగ్ చేయించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న.. ఇంతవరకు రాష్ట్రం గీతం లేకుండా పోయింది. గతంలో జరిగిన కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం గీతంపై కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా తీసుకు రానున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణకు ప్రత్యేక రాష్ట్ర గీతం ఉండాలని ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గతంలో అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతాన్ని అమోదిస్తూ కేబినెట్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే తెలంగాణ ఉద్యమం కంటే ముందు ఈ గీతాన్ని రచించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత కొన్ని మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే ఆ గీతం రాసిన అందెశ్రీకి కొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వం సూచించింది. అందులో భాగంగా అందెశ్రీ ఈ గీతంలో మార్పులు చేసి ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం అమోదముద్ర వేసింది. ఆ గీతాన్ని సినీ సంగీత దర్శకుడు కీరవాణితో కంపోజింగ్ చేశారు. జూన్2న రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో.. ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుంది. ఈ కార్యక్రమానికి సోనియా గాంధీని చీఫ్ గెస్ట్‌గా పిలవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. నిన్న నిర్వహించిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సోనియాగాంధీ చేతుల మీదుగా తెలంగాణ గీతాన్ని విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తెలంగాణ గీతాన్ని వినిపించారు. ఈ గీతం చాలాబాగుందని రేవంత్ కితాబిచ్చారు. అయిదారు చరణాలతో పూర్తి గీతం ఉంటుంది. ఇందులో ఉన్నటువంటి రెండు చరణాలను మాత్రమే రాష్ట్రం గీతంగా ప్రకటించారు. ఈ రెండు చరణాల్లో తెలంగాణ అవిర్భావం ఎలా జరిగింది, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుకొచ్చేలా రాష్ట్ర గీతం ఉండనున్నది. జూన్2న రాష్ట్ర ప్రజలకు అంకితం చేయనున్నారు.



2లో

## తెలంగాణలో యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జ్ విసిలు

- పది యూనివర్సీటీల బాధ్యతలను ఐఎఎస్‌లకు అప్పగింత
- ఉస్మానియాకు దాన కిశోర్..జెఎన్టీయూకు బుర్రా వెంకటేశం
- తెలుగు వర్సిటీ విసిగా శైలజారామయ్యర్‌ల నియామకం






## ఢిల్లీ లిక్కర్ కేసులో ముగిసి విచారణ

**న్యూఢిల్లీ,వేగుచుక్క న్యూస్ :** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీటుపై మంగళవారం విచారణ ముగిసింది. ఈడీ దాఖలు చేసిన ఏడవ సప్లిమెంటరీ ఛార్జిషీట్‌పై ప్రత్యేక న్యాయస్థానం విచారణ జరిపింది. 8 వేల పేజీలతో కూడిన ఛార్జిషీటును ఈడీ దాఖలు చేసింది. ఎమ్మెల్సీ కవిత సహా 5 మంది నిందితులపై ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ

చార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకునే అంశంపై వాదనల అనంతరం తుది ఉత్తర్వులను కోర్టు వాయిదా వేసింది. ఈ నెల 29న ఉత్తర్వులువెలువరించనున్నట్లు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కావేరి బవేజా తెలిపారు.

మరోవైపు ఈ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్‌కు

వ్యతిరేకంగా ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌పై ఈ నెల 28న వాదనలు మొదలుకానున్నాయి.

## ధాన్యం కొనుగోళ్లపై దుష్ప్రచారం

- వరివేస్తే ఉరి అన్నవారా.. విమర్శించేది
- చివరి గింజవరకు కొంటూనే ఉంటాం
- తడిసిన, మొలకెత్తిన ధాన్యం కూడా సేకరిస్తాం
- సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో మొదలు పెట్టాం
- అబద్ధాలతో రైతులను ఆందోళనకు గురిచేస్తే ఊరుకోం
- బిఆర్ఎస్, బిజెపిల తీరుపై మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి



2లో

## టాలీవుడ్‌లో రేవ్ పార్టీ కలకలం

- తెలుగు నటి హేమ పాల్గొన్నట్లు ఆధారాలు
- బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్ వెల్లడి
- డ్రగ్స్ నిర్మూలనలో కఠినంగా వ్యవహరిస్తామన్న మంత్రి
- బెంగళూరు రేవ్ పార్టీతో హైదరాబాద్ పోలీసుల అప్రమత్తం
- ఫామ్‌హౌజ్ ఓనర్లకుహెచ్చరికలు జారీచేసిన పోలీసులు



2లో

## అవినీతికి ఆలవాలం కాంగ్రెస్ పాలన

### మాజీమంత్రి ఈటెల రాజేందర్ విమర్శలు



**వేగుచుక్క న్యూస్, వరంగల్:** సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ నేత ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలతో ఛీకొట్టించుకున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. వరంగల్‌లో మంగళవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమంలో ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ అక్రమ డబ్బులు వసూలు చేసిందని విమర్శించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షానే స్వయంగా ఆర్ఆర్ ట్యాక్స్ గురించి చెప్పారంటే.. రాష్ట్రంలో ఏం జరుగుతుందో అర్థం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.కాంగ్రెస్ వాళ్లు ఆవురావురుమన్నట్లుగా ఉన్నారని ఈటల రాజేందర్ అన్నారు. ఎప్పటివరకు అధికారంలో ఉంటామో తెలీదని.. వీలైనంత తొందరగా అంతా సర్దుకుని పెట్టుకుంటున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో బిల్డింగ్ పర్మిషన్ కావాలంటే కాంగ్రెస్ వాళ్లకు సపరేట్ ఫీజు కట్టాల్సి వస్తుందని.. లేదంటే పర్మిషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు.

## నర్సింగ్ ఉద్యోగులకు జీతాలు లేవు

### వెంటనే చెల్లించాలన్న ఎమ్మెల్యే హరీష్ రావు

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:** కొత్తగా నియమితులైన 4 వేల మంది నర్సింగ్ ఆఫీసర్లకు నాలుగు నెలలుగా జీతాలు లేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. అట్టహాసంగా వారికి నియామక పత్రాలు ఇచ్చినా జీతాలు మాత్రం ఇవ్వడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన 7 వేల మంది నర్సింగ్ ఆఫీసర్ల నియామక ఘనతను తన ఖాతాలో వేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం..నాలుగు నెలలుగా వారికి జీతాలు మాత్రం చెల్లించడం లేదని విమర్శించారు. ఎల్బీ స్టేడియం వేదికగా అట్టహాసంగా నియామక పత్రాలు అందించి గాలికి వదిలేసింది తప్ప, వారి జీత భత్యాల గురించి అస్సలు పట్టించుకోవడం లేదంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. దీంతో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో నియమితులైన 4 వేల మంది నర్సింగ్ ఆఫీసర్లకు జీతాలు అందక అష్టకష్టాలు పడుతున్నారని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని



చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నట్లు లేని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటికైనా వాస్తవాలు గుర్తించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలును తక్షణమే చెల్లించాలన్నారు.

వేగుచుక్క
TELUGU DAILY NEWS

తెలంగాణం




బుధవారం
22-5-2024




# బోనస్ పథకం..బోగస్

**హైదరాబాద్:**కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. రైతు వ్యతిరేక పాలన అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా విమర్శించారు. ప్రచారంలో ప్రతిగింజకు బోనస్ అని ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే అంటారా? అని ప్రశ్నించారు. ఇది కపట కాంగ్రెస్ మార్కు మోసం, దగా, నయవంచన అన్నారు. నీరివ్వరు.. కరెంట్ ఇవ్వరు.. పంట కూడా సరిగా కొనుగోలు చేయరా? అని నిలదీశారు. రూ.15 వేలు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఏం అయ్యాయన్నారు.నమ్మి ఓట్లేస్తే గొంతు కోస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్లలెప్లలెనా ప్రశ్నిస్తారు.. రైతన్నలతో కాంగ్రెస్ కౌంట్‌డౌన్ మొదలైందని పేర్కొన్నారు. ఆ పార్టీది ఓట్ల నాడు ఓ ముచ్చట.. నాట్లనాడు ఓ ముచ్చట అని ఎద్దేవా చేశారు. ప్రతి రైతుకు డిసెంబర్

9నే రూ.2 లక్షల రుణమాఫీ అన్నారని.. ఇంకా అమలు చేయలేదని చెప్పారు. నేడు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వ బోగస్ విధానాన్ని బయట పెట్టారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీ గాలిమాటలతో గారడీ చేసిందని, లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు డబ్బాలో పడగానే తన నిజస్వరూపాన్ని బయటపెట్టిందని విమర్శించారు.

## రాష్ట్రవ్యాప్తంగా చల్లబడ్డ వాతావరణం



హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. భారీ ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగింది. గత రెండు రోజుల నుంచి రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అయితే మరో రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం రోజు నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, నారాయణపేట్, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులు వీస్తూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. కాగా ద్రోణి కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు సముద్ర మట్టం నుంచి విస్తరించిందని వివరించింది. ఆకాశం మేఘావృతమై ఉండనుందని వాతావరణ శాఖ తెలిపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## తెలంగాణలో యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జ్ విసిలు



హైదరాబాద్: తెలంగాణలోని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల పదవీకాలం ముగియడంతో ఇన్‌ఛార్జ్ విసిలను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు ఇంఛార్జ్ వీసీలను నియమించారు. సీనియర్ ఐఏఎస్ అధికారులకు ఇంఛార్జ్ వీసీలుగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా దాన కిషోర్ నియమితులయ్యారు. జేఎన్టీయూ ఇంఛార్జ్ వీసీగా బుర్రా వెంకటేశం, కాకతీయ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా కరుణ వాకాటి,తెలంగాణ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా సందీప్ సుల్తానియా, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా రిజ్వి, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా శైలజ రామయ్యర్, మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా నవీన్ మిట్టల్, శాతవాహన యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా సురేంద్రమోహన్, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీ జయేష్ రంజన్, పాలమూరు యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా నదీం అహ్మద్‌లను ప్రభుత్వం నియమించింది.

## చిత్తవుతున్న ధాన్యం రైతులు

**ఆదిలాబాద్:** ఎన్నిచర్యలు తీసుకున్నా,అధికారులు పర్యవేక్షిస్తున్నా రైతుకు దళారుల బెడద తప్పడం లేదు. గత్యంతరం లేని రైతులు మధ్య దళారులకే విక్రయిస్తున్నారు. ధాన్యం అమ్మకాల్లో



రైతులు ఏటా సమస్యలు ఎదుర్కొంటున్నా వారిని పట్టించుకోవడం లేదు. అకాల వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని ఓ వైపు ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట కొనుగోళ్లు లేక కలవరపడుతున్నాడు. నిబంధనల పేరిట ప్రభుత్వరంగ సంస్థలు ఇబ్బంది పెడుతుంటే.. దళారులు ధర తగ్గించి పంట కొనుగోలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లాల్లో దళారులది ఆడిందే ఆటగా మారింది. మొదట్లో పంట బాగానే ఉన్నా అకాల వర్షాల వల్ల పంట కొంత దెబ్బతింది. కొనుగోలులో అవకతవకలు జరుగకుండా ఉండాలనే ఆలోచనతో రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను కూడా జారీ చేశారు. మధ్య దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోకుండా ఉండాలనే ఆలోచనతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయినా తేమశాతం పేరుతో తరుగు తీస్తున్నారు. అయితే అధికారులు నిబంధనలు పెట్టడంతో ఇప్పుడు పల్లెల్లోకి దళారులు వచ్చి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా కొందరు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఇలా ఏ గ్రామానికి వెళ్లినా మధ్య దళారులు ఇలా రైతుల ఇంటికి వెళ్లి తక్కువ ధరకే నేరుగాకొనుగోలు చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా వ్యవసాయాధికారులుగానీ, మార్కెటింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



# టాలీవుడ్‌లో రేవ్ పార్టీ కలకలం

బెంగళూరు/హైదరాబాద్,: రేవ్ పార్టీ టాలీవుడ్‌లో కలకలం సృష్టిస్తోంది. నగర శివారులో నిర్వహించిన రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ పాల్గొన్నట్లు బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్ స్పష్టం చేశారు. ఆమె సోమవారం విడుదల చేసిన వీడియో ఎక్కడి నుంచి తీశారో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఈ ఈవెంట్‌లో పాల్గొనడానికి పెద్ద మొత్తంలో ఫీజు వసూలు చేశారని.. దాదాపు వంద మంది పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ప్రజా ప్రతినిధులెవరూ పాల్గొనలేదని కమిషనర్ వెల్లడించారు. ’సన్ సెట్ టు సన్ రైస్ విక్టరీ’ పేరుతో నిర్వహించిన ఈ పార్టీలో పాల్గొన్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర స్పందించారు. 'రేవ్‌పార్టీలో కోట్ల రూపాయల విలువైన కొకైన్, గంజాయి స్వాధీనం చేసుకున్నాం. రాష్ట్రాన్ని డ్రగ్స్‌ఫ్రీగా మార్చాలని చేసే ప్రయత్నాలు ఇతర రాష్ట్రాల డ్రగ్స్ పెడ్లర్ల వల్ల విఫలమవుతున్నాయి. ఈ కేసులో అరెస్ట్ చేసిన వారి నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తాం' అని తెలిపారు. బెంగుళూరు శివారులో ఓ వ్యాపారవేత్తకు చెందిన ఫామ్ హౌస్‌లో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడిన విషయం తెలిసిందే. ఆ పార్టీలో తాను లేనని తెలుపుతూ హేమ ఓ వీడియో విడుదల చేశారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని.. తనపై వస్తోన్న వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. అయితే రేవ్ పార్టీలో పోలీసులు సంపాదించిన ఫోటోలోని డ్రెస్,

వీడియోలని డ్రెస్ ఒకటే కావడంతో అనుమానాలు బలపడ్డాయి. ఇదిలావుంటే బెంగళూరు శివారులో రేవ్ పార్టీ ఉదంతం హైదరాబాద్‌లో ప్రకంపనలు రేపుతోంది. నగర శివార్లలోని ఫాంహౌస్‌లలో తరచూ డ్రగ్స్ పట్టుబడడంతో పోలీసులు కఠిన చర్యలకు దిగారు. రేవ్ పార్టీలు, అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం లేకుండా నిఘా ఉంచారు. ఫాంహౌస్‌ల యజమానులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ కేసులో సినీ పరిశ్రమ సహా వివిధ రంగాల ప్రముఖుల పేర్లు బయటకు వచ్చాయి. ఈ పార్టీ వెనుక లింకుల్ని ఛేదించగా గోవా జైలులో ఉండే డ్రగ్స్ స్మగ్లర్ల పేర్లు బయటకొచ్చాయి. అంతకు ముందు టీఎస్ న్యాబ్ ఆధ్వర్యంలో రాజకీయ, సినీ ప్రముఖులపై కేసులు నమోదయ్యాయి. వరుస పరిణామాల దృష్ట్యా రేవ్ పార్టీని హైదరాబాద్‌లో కాకుండా బెంగళూరులో నిర్వహించినట్లు నగర పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ.50 లక్షల వ్యయంతో ఈ పార్టీ నిర్వహించిన వాసు నేపథ్యం, అతడి సంబంధాలపై దృష్టి సారించారు.

## ప్రపంచంతో పోటీ పడేలా పారిశ్రామిక విధానాలు

**హైదరాబాద్:** పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడేలా విధానాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు సంబంధించి మంగళవారం అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన నూతన విధానాలపై పలు సూచనలు చేశారు. గత సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, పనుల్లో పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. టెక్స్ టైల్స్‌కు సంబంధించి రాష్ట్రంలోని పవర్ లూమ్, హ్యాండ్ లూమ్ కార్మికులకు ఉపయోగపడేలా కొత్త పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి కొత్తగా ఆరు పాలసీలను రూపొందించనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఎంఎస్‌ఎంఈ పాలసీ, ఎక్స్ పోర్ట్ పాలసీ, న్యూ లైఫ్ సైన్సెస్ పాలసీ, రివైజ్డ్ ఈవీ పాలసీ, మెడికల్ టూరిజం పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలను రూపొందిస్తుమన్నామని సీఎంకు వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసేలోగా పారిశ్రామిక పాలసీలను పూర్తిస్థాయిలో రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## నిరుద్యోగుల పాలిట శాపంగా కాంగ్రెస్ విధానాలు

**నల్లగొండ:** నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ పార్టీ తీరుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు.. నిరుద్యోగ భృతి ఊసే లేదు అని కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖమ్మం- వరంగల్ -నల్లగొండ పట్టభద్రుల

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఖమ్మం ? నల్లగొండ ? వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 4 లక్షల 70 వేల మంది పట్టభద్రులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై దుష్ప్రచారం

**హైదరాబాద్:** ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ప్రచారం మానుకోవాలని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే కావాలని దుష్ప్రచారాలు చేయడం, అబద్దాలు చెప్పడం అలవాటుగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి గింజ వరకు వడ్లు కొంటామని ఈ సందర్భంగా భట్టి వెల్లడించారు. గత బిఆర్‌ఎస్ సర్కార్ రైతులను పట్టించుకోలేదని, ప్రచారార్భాటాలు మాత్రం దండిగా చేసిందని విమర్శించారు. వరివేస్తే ఉరి అన్నవారా విమర్శలు చేసేదని మండిపడ్డారు. సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో మొదలు పెడతామని చెప్పారు. రైతుల పేరు మీద రాజకీయాలు చేయొద్దని ఆ రెండు పార్టీల నేతలకు ఆయన సూచించారు. స్వార్థ రాజకీయాల కోసం రైతులను వాడుకుంటున్నారని ఆగ్రహించారు. గత సర్కార్ తడిసిన వడ్లను కొనలేదని విమర్శించారు. తాము తడిసిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ రేటుకే కొంటున్నామని తెలిపారు. 15 రోజుల ముందు నుంచి వడ్లు కొనుగోలు పక్రియ ప్రారంభించామని చెప్పారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ స్వార్థం కోసం బీఆర్‌ఎస్ బీజేపీ నేతలు అడ్డగోలుగా మాట్లాడొద్దని సూచించారు. గత బిఆర్‌ఎస్ మోసం చేసిన మాదిరిగా కాకుండా...వర్షాలకు తడిచిన ధాన్యం కూడా కొంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే రాజకీయాలు చేయడం అలవాటు కనుక ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అబద్దాలు చెప్పడం భారాస నేతలకు అలవాటన్నారు. 15 రోజుల ముందుగానే ధాన్యం కొంటున్నట్లు వివరించారు. గతం కంటే ఎక్కువగా 7,215 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని అప్పటి ప్రభుత్వం కొనలేదని గుర్తు చేశారు. ‘చివరి గింజ వరకూ కొంటాం.. రైతులు ఆందోళన చెందవద్దని భట్టి భరోసా ఇచ్చారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యానికి కూడా ఎంఎస్‌పీ ఇచ్చి తీసుకుంటాం. ధాన్యం రైతులకు మూడు రోజుల్లోనే డబ్బు అందిస్తున్నాం. వర్షసూచనపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇవ్వాలి. రూ.500 బోనస్ సన్న ధాన్యానికే అని విపక్షాలు విమర్శిస్తున్నాయి. రూ.500 బోనస్ అనేది సన్న ధాన్యం నుంచి



మొదలుపెట్టాం‘ అని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో వరి కొనుగోళ్ల విషయంలో రైతులు) ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ధాన్యం తడిసినా, చివరకు మొలకెత్తిన గింజలు కూడా కొంటామని వెల్లడించారు. రేటు తగ్గించకుండా కొంటామని అన్నారు. దీంతోపాటు వరి ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ఈ అంశం ప్రతిపక్షాలకు రుచించడం లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులను ఇబ్బంది పెట్టేందుకు రాజకీయాలను వాడొద్దని ప్రతిపక్షాలకు డిప్యూటీ సీఎం హితవు పలికారు. రాష్ట్రంలో అసలు ధాన్యమే కొనుగోలు చేయడం లేదు, కల్లాళ్లలోనే ధాన్యం తడిసి ముద్దవుతుందని బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. అందులో నిజం లేదని చెప్పారు. గత ఏడాది ఇదే సమయంలో తాను పాదయాత్ర చేస్తుండగా రోడ్ల వెంట ధాన్యం కుప్పలుగా పోసి రైతులు ఇబ్బంది పడేవారని భట్టి గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం గత ప్రభుత్వం కంటే 15 రోజులు ముందుగానే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ మాదిరిగా కాకుండా మీకంటే ఎక్కువ కేంద్రాల్లో 7,245 కొనుగోళ్లను ప్రారంభినట్లు స్పష్టం చేశారు. ఎన్ని టన్నుల ధాన్యం పండినా కూడా కొంటామని స్పష్టం చేశారు.

# ఇండియా కూటమికి బుద్ధి చెప్పిన ప్రజలు

**పాట్నా:** అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, టుక్డే టుక్డే గ్యాంగ్‌పై జూన్ 4న కీలక నిర్ణయం రాబోతోందని ప్రధాని మోడీ అన్నారు. ఇంతవరకూ జరిగిన ఐదు విడతల పోలింగ్‌లో 'ఇండి' కూటమి పూర్తిగా ఓటమిపాలైందన్నారు. ఇండియా కూటమి పాపాలతో 21వ శతాబ్దపు భారతదేశం పురోగమించ లేదని, ఆ కారణంగానే ప్రతి ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, ఆర్జేడీ వంటి పార్టీలకు గట్టి గుణపాఠం చెబుతున్నారని అన్నారు.విపక్ష పార్టీల సారథ్యంలోని 'ఇండియా' కూటమిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. 21వ శతాబ్దపు భారతదేశాన్ని 'ఇండి' కూటమి పాపాలు ముందుకు తీసుకువెళ్లలేవని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఆరో విడత ప్రచారంలో భాగంగా బీహార్ లోని ఈస్ట్ చంపరాన్‌లో మంగళవారంనాడు జరిగిన ర్యాలీలో ప్రధాని ప్రసంగిస్తూ, కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీలు దేశాన్ని 60 ఏళ్ల పాటు ధ్వంసం చేశాయని, మూడు, నాలుగు తరాల జీవితాలను నాశనం చేశాయని మోదీ విమర్శించారు. 60 ఏళ్లలో ఈ వ్యక్తులు భారీ ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. స్విస్ అకౌంట్లు తెరిచారు. మీ పిల్లలకు చదువుకునేందుకు స్కూళ్లులేవు. వారి పిల్లలు మాత్రం విదేశాల్లో చదువులు కొనసాగించారు. పేదల కష్టాల పాలయ్యారని అన్నారు. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌పై ప్రధానమంత్రి మోదీ పరోక్ష విమర్శలు చేస్తూ, జూన్ 4 తర్వాత మోదీ బెడ్ రెస్ట్ తీసుకుంటారని ఇక్కడ ఒకరు అన్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు.



# కుల జనగణన తర్వాతే

## "స్థానిక సంస్థల ఎన్నికలు" నిర్వహించాలి.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, మే 21:**



**కాంగ్రెస్ ఎన్నికల్లో చేసిన వాగ్దానం నిలుపుకోవాలి.**

**43% బిసి రిజర్వేషన్ అమలు చేయాలి.**

**బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్ డిమాండ్.**

కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం రాష్ట్రంలో కుల జనగణన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, స్థానిక సంస్థల్లో 43% బిసి రిజర్వేషన్ అమలు ద్వారా బిసి, ఎంబిసి లకు వర్గీకరణతో కూడిన బిసి రిజర్వేషన్ అమలు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బిఎల్ పి) రాష్ట్ర అధ్యక్షులు, బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ నల్లకుంటలోని బహుజన లెఫ్ట్ పార్టీ (బిఎల్ పి) రాష్ట్ర కార్యాలయంలో బహుజన లెఫ్ట్ పార్టీ (బిఎల్ పి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ అధ్యక్షతన రాష్ట్ర కమిటి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు ఉండడం వల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత స్థానానికి రాణించ గలుగుతున్నారని వెల్లడించారు. దేశ జనాభాలో దాదాపు 60%ఉన్న బిసి జాతులకు అసెంబ్లీ పార్లమెంట్ లాంటి చట్టసభలకు రాజ్యాంగపర రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడం వల్లనే బిసి సమాజం వెనుకబాటుకు కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా అభివృద్ధి చెందిన జాతి మాత్రమే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధి సాధించిగలదని చరిత్ర చెబుతున్న సత్యమిదేన్నారు.అయితే ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల కనుసన్నులలో మెదిలే రాజకీయ బానిసల పట్ల స్వయం గౌరవం ఉన్న బిసిలు, ఎస్సీ, ఎస్టీలు జాగ్రత్తగా ఉండాన్నారు. ముఖ్యంగా బిసి సమాజానికి ఈ బానిసల నుండి మొదటి ప్రమాదం పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్ లాంటి ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల్లో పని చేసే ఎస్సీ, ఎస్టీ, బిసిలు తమ జాతి ప్రజల ప్రయోజనాల కంటే తమ బంధువులు, వారసుల కోసమే జాతి ప్రయోజనాలను తాకట్టు పెడుతుంటారని విమర్శించారు.పార్టీ ఏదైనా ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల్లో పనిచేసే వారికి ఎప్పుడు స్వయంగౌరవం (ఆత్మగౌరవం) ఉండదని, ఇలాంటి వారినే మాన్యవర్ కాన్షీరాం రాజకీయ చెంచాలుగా పోల్చారని గుర్తుచేశారు.ఈ సమావేశంలో బహుజన లెఫ్ట్ పార్టీ(బిఎల్ పి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్దిరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సబ్బని లత, ఎంఎ గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మారోజు సునీల్ కుమార్, రాష్ట్ర కమిటి సభ్యులు ఎం. ఆంజనేయులు, వడ్ల సాయి కృష్ణ, కె.సమ్మయ్య, కర్రేవార్ నగేష్, అబ్బగోని అశోక్ గౌడ్, ఎలిమినేటి శ్రీశైలంలు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి.

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, మే 21**



ఈ నెల 24 నుండి జూన్ 3 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 10,511 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఇందుకోసం 29 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం థియరీ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాన్నం 12 గంటల వరకు, రెండవ సంవత్సరం విద్యార్థులకు మధ్యాన్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు పరీక్షలు జరుగునని ఆయన తెలిపారు. ఈ నెల 24 న సెకండ్ లాంగ్వేజ్, 25 న ఇంగ్లిష్, 28 న మాథ్స్ పేపర్-ఏ /బోటనీ/పొలిటికల్ సైన్స్, 29న మాథ్స్ పేపర్ బి/జూలజి/హిస్టరీ, 30 న ఫిజిక్స్/ఎకనామిక్స్, 31 న కెమిస్ట్రీ/కామర్స్, జూన్ 1 న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జ్ కోర్స్ మాథ్స్ (బై.పి సి,) విద్యార్థులకు, 3 న మోడరన్ లాంగ్వేజ్, జియోగ్రఫీ పరీక్షలుంటాయని కలెక్టర్ తెలిపారు. కాగా ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 4 నుండి 8 వరకు ఉదయం 9 నుండి 12 గంటల వరకు, 2 నుండి 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ ఉదయం 9 గంటలకు, ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష 11న ఉదయం 10 నుండి ఒంటి గంట వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష 12 న ఉదయం 10 నుండి ఒంటి గంట వరకు జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్ష హాలుకు అనుమతి లేదని, ఎలక్ట్రానిక్స్ గాడ్జెస్ కూడా అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

**జూన్ 3 నుండి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు.**

జూన్ 3 నుండి 13 వరకు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని, పరీక్షలకు హాజరయ్యే 869 మంది విద్యార్థులు కోసం కామారెడ్డి, బాన్సువాడ మండల కేంద్రాలలో ఒక్కో కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఫీజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ మినహా అన్ని పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాన్నం 12.30 గంటల వరకు జరుగుతాయని, ఆ పరీక్షలు మాత్రం ఉదయం 9. 30 నుండి 11 గంటల వరకు జరుగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. జూన్ 3 న ఫస్ట్ లాంగ్వేజ్, 5న సెకండ్ లాంగ్వేజ్, 6న థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్, 7న మాథ్స్ పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. కాగా జూన్ 8 న ఫిజికల్ సైన్స్, 10 న బయాలజికల్ సైన్స్, 11 న సోషల్ స్టడీస్, 12 న సంస్కృత/అరబిక్ మొదటి పేపర్, 13 న సంస్కృత, అరబిక్ రెండవ పేపర్ పరీక్ష జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షలు సాఫీగా నిర్వహించుటకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్ష హాలుకు అనుమతి లేదని, ఎలక్ట్రానిక్స్ గాడ్జెస్ కూడా అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# 23న "ప్రజాస్వామ్యం - మీడియా" అంశంపై సదస్సు



**తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి హాజరు.**

**జూన్ 18 19 తేదీల్లో ఖమ్మంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర 3వ మహాసభలు**

**కరపత్రాలు ఆవిష్కరించిన జిల్లా శాఖ అధ్యక్షులు సంజీవ్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 21**

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టి యు డబ్ల్యు జె)నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న గురువారం ఉదయం 10.30 గంటలకు జిల్లా సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని సంఘం జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్ చెప్పారు. మంగళవారం నిజామాబాదు ప్రెస్ క్లబ్ లో సదస్సుకు సంబందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎడ్ల సంజీవ్ మాట్లాడుతూ, జూన్ -18,19 తేదీల్లో ఖమ్మంలో జరిగే టియుడబ్ల్యుజె 3వ రాష్ట్ర మహాసభను పురస్కరించుకొని "ప్రజాస్వామ్యం - మీడియా" అంశంపై నిజామాబాదు నగరంలోని బస్వా గార్డెన్స్ లో సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు.. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐ జె యు) జాతీయ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి, విశిష్ట అతిధిగా ప్రజాకవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డి హాజరవుతారని చెప్పారు. అతిథులుగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, బోధన్ శాసన సభ్యులు పీ. సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నగునూరి శేఖర్, విరహత్ అలీ హాజరవుతారన్నారు.

జిల్లాలోని జర్నలిస్టులందరూ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్ విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ బాలాజి, కోశాధికారి సిరిగాద ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదారి సంజీవ్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు చింతల గంగాదాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అహ్మద్ అలీఖాన్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రమోద్ గౌడ్ , ఎంఎ మాజిద్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకరి రాజేష్, సంఘంకార్ ధనుంజయ్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కొక్కు రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మండే మోహన్ తదతరులు పాల్గొన్నారు.

# కేంద్ర,రాష్ట్ర సంబంధాలు బలపడాలి



**ఉమ్మడి ఎజెండాతో ముందుకు సాగాలి**

**కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వంపై కీలక బాధ్యతలు**

**న్యూఢిల్లీ:** పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు గమనించాలి. ఐదుదశల పోలింగ్ ముగిసింది. మరో రెండు దశలు మిగిలి ఉన్నాయి. కేంద్రంలో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేయబోయేది జూన్ నాలుగును తేలనుంది. కొత్తగా అధికారంలోకి వచ్చే ప్రబుత్వం దేశహితం కోసం వేగంగా అడుగులు వేయాల్సి ఉంది. రాష్ట్రాల్లో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా కలుపుకుని పోవాలి. అభివృద్ధి విషయంలో ఉమ్మడి జట్టుగా పోరాడాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అందుకే కొత్తగా ఏర్పడే ప్రభుత్వం రాష్ట్రాలకు నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాల్సి ఉంటుంది. . రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. ఇదే సందర్భంలో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షించుకునే అవకాశాలు ఉండాలి. కనీసం ఒక్కో రాష్ట్రానికి ప్రధాని నెలలో ఒకరోజయినా సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు చర్చించాలి. నీతి ఆయోగ్ సమావేశలను కూడా కనీసం మూడు నెలలకో మారయినా సమావేశ పరచి చర్చిస్తే మంచిది. ధాన్యం సేకరణ, నదీజలాల కేటాయింపు సమస్యలు,విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా రాష్ట్రాలతో చర్చించాలి. వాటిని విశ్వాసంలోకి తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్ర రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు పెరగాలి. రేవంత్ కావచ్చు..జగన్ కావచ్చు.. మమతా బెనర్జీ కావచ్చు.. లేదా మరే ఇతర రాష్ట్ర సిఎం అయినా కావచ్చు పాలనాపరమైన విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. ఎవరైనా కేంద్రంతో నిరంతరాయంగా అనుసంధానం అవుతూనే ఉండాలి. ఫెడరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం సర్వసాధారణం. ఇది విమర్శించే రాజకీయ పార్టీలు గుర్తించాలి. ఇదే సందర్భంలో కేంద్ర రాష్ట్రాల మధ్య పన్నుల విధానంలో పారదర్శకత ఉండాలి. జిఎస్టీ విషయంలో ప్రధానంగా చర్చించాలి. ఏయే రంగగాలు కదులేవుతున్నదీ చర్చించాలి. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందగలదన్న విశ్వాసంతో కేంద్రం ముందుకు సాగాలి. అవినీతి విషయంలో కూడా ఎవరు చేసినా చట్టబద్ధంగా శిక్షకు గురి కావాల్సిందే. ఇందులో బెదిరింపు రాజకీయాలకు తావుండరాదు. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జిఎస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరించుకోవడం సిఎంల కర్తవ్యం. ఇవన్నీ చక్కబెట్టుకోవడం కోసం ఢిల్లీకి వెళ్లాల్సిందే. కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. అలాగే కేంద్రం కూడా పెద్దన్న పాత్ర పోషించాలే తప్ప నిరంతరరం రాజకీయాం చేయడం సరికాదు.

# పాలకులకు ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం!

## అభివృద్ధి కేంద్రంగా పథక రచన చేయాలి

**హైదరాబాద్:** రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టి కరచిపోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. గుదిబండగా మారిన పథకాలకు మంగళం పాడాలి. నితరంతరాయంగా డబ్బుల పందేరంతో ఓట్లు పొందాలన్న పథకాలను ఇక ఎంతమాత్రం కొనసాగించరాదు. ఈ డబ్బుల పందేరాన్ని అభివృద్ధిగా చూపి ప్రచారం చేసుకోవడం కూడా సరికాదు. అప్పుల భారం పెరుగుతున్న క్రమంలో ఉచితపథకాలను తగ్గించుకోవడం ద్వారా ప్రజలపై భారం పడకుండా చూడాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రూపాయికే కిలో బియ్యం పథకం గుదిబండగా మారింది. ఇప్పుడు ధరలను పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే జనాభాను మించి తెల్లకార్డులు ఉన్నాయి. వీటిని సమీక్షించాలి. బియ్యం ధరలు కనీసం పదిగా నిర్ణయించాలి. ఇది ఎపికి కూడా వర్తిస్తుంది. కుటుంబ సర్వే ప్రకారం అర్హుల జాబితాను గుర్తించాలి. అలాగే రైతుబంధు జాబితాను కూడా మళ్లీ సమీక్షించాలి. బడాభూములున్న వారికి, తోటలు,




బంజరు భూములున్న వారికి రైతుబంధు సాయం అందకుండా చూడాలి. పథకాలతో ప్రజలను మచ్చిక చేసుకోవచ్చేమో కానీ అదే అభివృద్ధి అని నమ్మించడం సరికాదు. తాగు,సాగునీటితో పాటు, విద్యుత్, రోడ్డు వసతులను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలి. విద్యావైద్య రంగాలకు కేటాయింపులు పెంచి వసతులను మెరుగు పరచాలి. నిరుద్యోగ సమస్య మొత్తంగా పరిష్కరించకున్నా ఉపాధి అవకాశాలను పెంచాలి. రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు.. ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా హుందాగా ఉండాలి. రాజకీయాల్లో వ్యక్తిగత విద్వేషాలకు తావు ఉంరాదు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. కాంగ్రెస్, టిడిపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఎదురుతిరిగాయి. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. గత ఎన్నికల్లో గెలిచినా బిజెపి కూడా బలంగానే ఉందని ఉనికిని చాటింది.

# సుధీర్ బాబు హరోంహర విడుదల వాయిదా




సింగిల్ స్క్రీన్ సినిమా హాల్స్ కొన్ని రోజులపాటు మూసి వేస్తున్నామంటూ ఒక పక్క ప్రకటనలు వస్తుంటే, ఇంకో పక్క, సుమారు ఒక అరడజను సినిమాలు మే 31న విడుదల చేస్తున్నామంటూ ప్రకటించారు. ఆలా ప్రకటించిన వాటిలో సుధీర్ బాబు నటించిన 'హరోం హర' సినిమా కూడా వుంది. జ్ఞానశేఖర్ ద్వారక ఈ చిత్రానికి దర్శకుడు, మాళవిక శర్మ కథానాయికగా నటించింది. సునీల్ ఒక ముఖ్య పాత్రలో నటించారు. చిత్తూరు నేపథ్యంలో జరిగిన ఒక పీరియడ్ డ్రామా ఇది. సుధీర్ బాబు, తన మామయ్య కృష్ణ గారి పుట్టినరోజు అయిన మే 31 సందర్భంగా ఈ సినిమా విడుదల చేద్దామని ముందుగా అనుకున్నారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి విడుదల చెయ్యలేకపోతున్నామని, జూన్ 14 కి విడుదల వాయిదా వేశామని చెపుతున్నారు. మే 31 మిస్ అయినందుకు ఒక పక్క బాధగా వున్నా, జూన్ నెలలో విడుదల చేస్తున్నందుకు తనకి బాగా కలిసి వచ్చిన నెల అది అని చెపుతున్నారు సుధీర్ బాబు. ఎందుకంటే తన సినిమాలు 'సమ్మోహనం', 'ప్రేమ కథా చిత్రం' ఈ జూన్ నెలలోనే విడుదలై మంచి విజయాలు సాధించాయని చెపుతున్నారు. ఇప్పుడు ఈ 'హరోం హర' కూడా ఈ జూన్ 14న విడుదలై తనకి మంచి విజయాన్ని అందిస్తుందని ఆశిస్తున్నట్టుగా చెపుతున్నారు.

# కేన్స్ చిత్రోత్సవం..ఓ మరువలేని అనుభూతి
## నటి కియారా అద్వానీ వెల్లడి



'కేన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొనడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తానని బాలీవుడ్ నాయిక కియారా అద్వాణీఅన్నారు. తనదైన నటనతో మెప్పించే ఈ భామ.. ఇటీవలే కేన్స్ చిత్రోత్సవాల్లో మెరిసి సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన 'ఉమెన్ ఇన్ సినిమా' అంశంపై జరిగిన చర్చా వేదికలో పాల్గొంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ వేడుకలోని తన అనుభవాలు, రాబోయే ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తిర విషయాలను కియార పంచుకుంది. కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవ్వడం సంతోషంగా ఉంది. నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లోనే ఎంతో మధురమైన జ్ఞాపకంగా ఉండిపోతుంది. దాదాపు 20ఏళ్ల క్రితం నా కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకకు హాజరయ్యాను. చిన్నప్పుడు దీని గురించి ఇంటర్నెట్ ద్వారా తెలుసుకునేదాన్ని. కానీ.. నేను ఒక సెలబ్రెటీగా ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేడుకలో పాల్గొంటానని ఆ సమయంలో నాకు తెలీదు. కేన్స్ చిత్రోత్సవం నాకు ఎప్పటికీ మర్చిపోలేని ఒక అనుభవం' అంటూ ఆనందం వ్యక్తం చేసింది. యాక్షన్ చిత్రాల్లో నటించడానికి చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నాను. 'వార్ 2', 'డాన్ 3'లతో ఆ కోరిక నెరవేరబోతుంది. ఇవి నా కెరీర్‌లోనే పెద్ద ప్రాజెక్టులు. ప్రేమకథలు, కామెడీ..ఇలా అన్ని జానర్లలో పనిచేశాను. కానీ చాలా కాలంగా పూర్తిగా యాక్షన్ నేపథ్యంలో సాగే చిత్రాల్లో నటించడం కోసం వేచి చూస్తున్నాను. ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది. ఒకానొక సమయంలో 'షేర్షా' సినిమాలో నేను భాగమైనప్పుడు.. 'ఓ మై గాడ్ ఇదొక యుద్ధానికి సంబంధించిన యాక్షన్ చిత్రం. ఇలాంటి ప్రాజెక్టులో ఈమె నటిస్తుందా..?' అని కొంతమంది నా మీద విమర్శలు చేశారు. కానీ.. ప్రస్తుతం భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న రెండు పెద్ద ప్రాజెక్టులు నా చేతుల్లో ఉన్నాయి. ఈ సినిమాల్లో నన్ను నేను నిరూపించుకోవడమే ముఖ్యం అని తెలిపింది.

# జెమినీలో రామాయణం సీరియల్
## 27 నుంచే ప్రారంభిస్తున్నట్లు వెల్లడి




పురాణాలలో 'రామాయణం' కి వున్నా వైశిష్ట్యం చాలాగొప్పది ఎందుకంటే శ్రీ మహావిష్ణువు మానవుడిగా జన్మించి ఎలా మసలుకోవాలి, ఎటువంటి ధర్మాలు పాటించాలి, ఎంతటి కష్టమొచ్చినా ధర్మాన్ని విడవకుండా ఎలా జీవనం సాగించాలి అని రాముని పాత్రలో చాటి చెప్పాడు. వాల్మీకి రచించిన ఈ రామాయణం ఎన్నిసార్లు విన్నా, చూసినా తనివి తీరదు అని చెపుతూ వుంటారు. రామరాజ్యం అన్న మాట రాముడు పరిపాలించిన తీరును బట్టి వచ్చింది. తండ్రి మాటకి కట్టుబడి, తండ్రిని ధర్మపథంలో నిలబెట్టడానికి అడవికి వెళ్లిన రాముడు, తండ్రి మాటని జవదాటని కొడుకుగా, ఏకపత్నీవ్రతుడిగా, ప్రజల క్షేమం కోసం ధర్మం తప్పని రాజుగా, అందరికి ఆదర్శంగా నిలిచిన శ్రీరామగాథను ఎన్ని సార్లు చూసినా తనివి తీరదు.అటువంటి రాముని చరిత్ర 'రామాయణం' మరోసారి తెలుగులో టీవిలో ప్రసారం కానుంది. ఇంతకీ ఈ రామాయణం సీరియల్ ఎక్కడ ప్రసారం అవుతోంది, ఎప్పటి నుండి కానుంది అంటే, ఈ నెల 27వ తేదీ నుండే. జెమిని టివిలో మే 27వ తేదీ సోమవారం సాయంత్రం గం. 6.30 లకు ఈ దృశ్యకావ్యం 'శ్రీమద్ రామాయణం' సీరియల్ ప్రసారం కానుంది అని నిర్వాహకులు చెపుతున్నారు. శ్రీ మద్ రామాయణం'. ఈ సీరియల్ లో శ్రీరాముని అవతార విశిష్టత, జన్మ వృత్తాంతం, లంకాధిపతి అయిన రావణాసురుడి జన్మ వృత్తాంతం మొదలుకుని రామాయణంలోని అన్ని ఘట్టాలను కనులకు కట్టినట్లుగా అద్భుతమైన సాంకేతిక విలువలతో అత్యద్భుతంగా చిత్రీకరించి శ్రీ రామ గాథను జెమిని టివి అభిమాన ప్రేక్షకులందరికి ఎప్పటికి గుర్తుంది పోయేలా అందించడం జరుగుతోంది అని చెపుతున్నారు. శ్రీ వాల్మీకి విరచిత రామాయణం 'శ్రీమద్ రామాయణం' గా సూపర్ గ్రాఫిక్ టెక్నాలజీతో, అనుభవజ్ఞులైన నటీనటుల నటనతో, మనుసుని ఆకట్టుకునే మాటలతో, ప్రతి తెలుగు ప్రేక్షకుడిని అలరించడానికి మే 27వ తేదినుండి సోమవారం నుండి శనివారం వరకు, ప్రతి రోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలనుండి 7 గంట 30 నిమిషాల వరకు ప్రసారం కానుంది.

# రామాయణం కోసం ప్రత్యేక శ్రద్ధ




బంగారు ఆభరణాలనే ఉపయోగించబోతున్న టీమ్‌భారతీయ పురాణెతిహాసం రామాయణం ఆధారంగా నితేష్ తివారి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల చిత్రీకరణ మొదలైన సంగతి తెలిసిందే! భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. దీంట్లో రావణుడి పాత్రధారి ధరించనున్న దుస్తులు, ఆభరణాలు వాడే వస్తువులు అన్నీ నిజమైన బంగారంతో తయారు చేసినవే వినియోగించనున్నట్లు సమాచారం. ఎందుకంటే రావణుడు స్వర్ణ నగరమైన లంకకు అధిపతి. ఆయన ధరించిన వస్త్రాలు కూడా పసిడి మయమేనని ఇతిహాసాల్లో చెప్పారు. అందుకే సినిమాలోనూ ఆ పాత్రను అలాగే చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో యశ్ ముఖ్య పాత్ర పోషించడమే కాకుండా నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. దీన్ని భారతీయ భాషలతోపాటు పలు విదేశీ భాషల్లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాను.



# గం..గం.. గణెళిశా'తో వస్తోన్న
## 31న విడుదల కానున్న చిత్రం




'గం.. గం.. గణెళిశా'తో ఆనంద్ దేవరకొండ థియేటర్లలో సందడి చేయనున్నారు. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ఉదయ్ శెట్టి తెరకెక్కించారు. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి సంయుక్తంగా నిర్మించారు. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు వంశీ పైడిపల్లి, రచయిత విజయేంద్ర ప్రసాద్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేందప్రసాద్ మాట్లాడుతూ.. 'దర్శకుడు ఉదయ్ నా దగ్గర పని చేశాడు. అంకిత భావం, కష్టపడే తత్వం ఉన్న వ్యక్తి. ఈ సినిమా తప్పకుండా విజయవంతమవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. బేబి' ట్రైలర్ జులైలో విడుదల చేశాం. అప్పుడు వర్షం పడింది. ఇప్పుడు మేలో ఈ ట్రైలర్ విడుదల చేశాం. ఇప్పుడూ వర్షం పడింది. 'బేబి'లాగే ఈ సినిమాతోనూ ఆనంద్‌కు విజయం దక్కాలని కోరుకుంటున్నా' అన్నారు దర్శకుడు వంశీ పైడిపల్లి. హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. 'తొలిసారి ఈ సినిమాలో ఓ హుషారైన విభిన్నమైన పాత్ర పోషించా. భయం, అత్యాస, కుట్ర అనే అంశాల్ని కేంద్రంగా చేసుకుని అల్లుకున్న క్రైమ్ కామెడీ ఇది. చిత్రసీమలో ఎవరైనా ఏదైనా సాధిస్తే కొన్ని గ్రూప్స్ మాత్రమే సెలబ్రేట్ చేస్తున్నాయి. అది సరికాదు. మనమంతా మన ఇండస్ట్రీ వాళ్లు సాధించే విజయాల్ని వేడుక చేసుకోవాలి' అన్నారు. 'వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమా రూపొందించాం. వినోదాత్మకంగా ఉంటూనే ట్విస్ట్‌లు థ్రిల్ పంచుతాయి' అన్నారు దర్శకుడు ఉదయ్. కార్యక్రమంలో సాయి రాజేశ్, సారిక, కేదార్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాతతో వివాదం.. పాయల్ ఇప్పుడేం

ఆర్ ఎక్స్ 100 మూవీతో తెలుగు మంచి క్రేజ్ సంపాదించుకున్న హీరోయిన్ పాయల్ రాజ్ పుత్.. రెండు రోజులుగా సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ఆమె నటించిన రక్షణ మూవీ మేకర్స్.. సొంపులు చూపిస్తే బాగుంటుందని డిస్ట్రిబ్యూటర్లు అడుగుతున్నట్లు తనతో చెప్పారని పాయల్ పెట్టిన పోస్ట్ ఒక్కసారి ఇండస్ట్రీలో కలకలం రేపింది. అయితే నిర్మాత ప్రణదీప్ ఇప్పటికే తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ కు పాయల్ పై ఫిర్యాదు చేయడం ఈ వివాదం కొత్త మలుపు తిరుగుతోంది.పాయల్ రాజ్ పుత్ నటించిన రక్షణ సినిమా దాదాపు ఐదేళ్ల తర్వాత ఇప్పుడు రిలీజ్ కు రెడీ అవుతోంది. విడుదలకు ముందు ఇప్పుడు హీరోయిన్, నిర్మాత మధ్య పెద్ద వివాదమే నడుస్తోంది. "రీసెంట్‌గా మంగళవారం సినిమా హిట్ అవ్వడంతో రక్షణ సినిమాను ఇప్పుడు రిలీజ్ చేస్తున్నారు. అగ్రిమెంట్ ప్రకారం రెమ్యునరేషన్ ఇవ్వకుండానే ప్రమోషన్స్ కు రావాలని ఒత్తిడి తెస్తున్నారు. రాకపోతే ఇండస్ట్రీ నుంచి బ్యాన్ చేస్తామని బెదిరిస్తున్నారు. న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి నేను సిద్ధం" అని పోస్ట్ చేసింది పాయల్.అక్కడికి ఒక రోజు తర్వాత.. టాలీవుడ్ ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ స్పందించింది. తమకు పాయల్ పై మార్చి నెలలోనే నిర్మాత ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. రక్షణ మూవీలో పాయల్ నటించిందని, కాబట్టి ఆమె పేరును వాడుకునే హక్కు నిర్మాతకు ఉంటుందని నిర్మాతల మండలి స్పష్టం చేసింది. అయితే ఈ ఫిర్యాదును మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కు ఫార్వర్డ్ చేశామని, కానీ పాయల్ రాజ్ పుత్ అందులో మెంబర్ కాదని తెలిసినట్లు చెప్పింది. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కు కూడా ఫార్వర్డ్ చేసినట్లు తెలిపింది.కౌన్సిల్ స్పందించాక ఈ వివాదంపై నెట్టింట జోరుగా చర్చ సాగుతోంది. అయితే పాయల్ పోస్ట్ చేయగానే.. అందరూ ఆమెకు మద్దతుగా నిలిచి చాలా పోస్టులు పెట్టారు. ఇలా కూడా టార్గెట్ చేస్తున్నారా అని ప్రశ్నించారు. కానీ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ స్పందించడంతో మొత్తం సీన్ అంతా రివర్స్ అయింది. ప్రెస్ నోట్ లో.. పాయల్ ఇచ్చిన డేట్స్ నుంచి రెమ్యునరేషన్ వరకు అంతా క్లియర్ గా కౌన్సిల్ వివరించడంతో ఒక్కసారిగా అంతా షాకవుతున్నారు. పాయల్ పోస్ట్ వెనుక కారణమేంటోనని చర్చించుకుంటున్నారు.అయితే ఏ ప్రాజెక్ట్ అయినా కొన్ని కారణాల వల్ల రిలీజ్ లేటు అవ్వడం సహజం. కానీ సినిమా ఎప్పుడు విడుదల అయినా క్లాజ్ 16 ప్రకారం.. ప్రమోషన్స్ విషయంలో యాక్టర్స్ సహకరించడం వారి బాధ్యత. దానికి తోడు కోవిడ్ సమయంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొని సినిమాను షూట్ చేసినట్లు మేకర్స్.. ఫిర్యాదులో చెప్పి ఉన్నారు. కాబట్టి ఎలాంటి సమస్యలు ఉన్నా.. పరస్పరం చర్చించుకునిపరిష్కరించుకోవాలని నెటిజన్లు అంటున్నారు. ఇక ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రకటన తర్వాత పాయల్ ఇంకా స్పందించలేదు. మరేం చెబుతుందో చూడాలి?